# రత్తి కోక కట్టింది

కిట్టకాలవకు నీరొచ్చిందంటే గూడెంలోవుండే కూల్జనం ఆ వాసన పీలుత్తా లెగిసి కూకుంటారు. ఆ వాసన పీలుత్తేనే ఆళ్ళ మొగాలకి రంగొచ్చుద్ది రంగు రాటమంటే, కోతల్లో రాల్పుకుండ తిండిగింజలు ఎండదెబ్బలకి ముంగల్నే నలసుకుపోటాన, పదతీత సాగేతలికి నెర్రెబగిల్న రేగడిగడ్డన పీక్కబోయిన డొక్కల్తో పొల్లాడ్తుండ జీవాలు, కిట్టకాలవతడి సల్లగా తగిలేతలికి, వానసినుకు తగిల్న కప్పలకిమల్లే బెకబెకమంటా తిండిగింజలకి నోళ్ళు దెరసుకు లెగసి కూకుంటారన్నమాట.

ఇగ సాగుతయి నాట్లు. నాట్లు సాగటవంటే కూల్జనం పుట్టబద్దలయిన వుషళ్ళకిమల్లే రేగడి బురదలో బూమి యాపత్తా యాడజూసినా తిరగాడ్తా, పాటలు పాడ్తా, యీరంగా లేసుకుంటా, బురదనీలు సల్లుకుంటా, కోకలెగ్గట్టి, పంచలు బిగ్గట్టి, పిట్టలొచ్చి గింజను పట పట పట పొడుత్తా పోయినట్టు చిట పట చిట పట మిసినీకిమల్లే నారునాడ్తా పోతారన్నమాట.

నాట్లు రాటమంటే, రంగుకోకలు కట్టుకుండ కూల్జనం మటాదార్లు నాలుగు పక్కలా కోపేసి నడిపిత్తావుంటే కొప్పుల్లో పూలుదోపుకుంటా, నోట్లో పువాకు ముక్క ఏసుకుంటే ఏసుకుంటా, చీతాం అనుకుంటే చుబ్బాం అనుకుంటా, సేతి గాజులు సరిజూసుకుంటా, కాలకడాలు కొట్టుకుంటా, నాటుకు సోల్పున పోతా వుంటే పక్కపక్క అరుగులమీన, రాత్తాపక్క సెట్ల మొగళ్ళకాడ కాత్తె సుమారైన వూరిజనం నడుంకిత్లేసుక్కూకుని, పువాకు యీనెల దీసుకుంటా నోళ్ళు దెరసుకు నీలుగారుత్తా సూత్తావుంటారన్నమాట.

ఈ యవదానంలో— కోడి పెట్టిన గుడ్డు పిల్లయి కూకుండట్టు— నిన్న మొన్నదాకా ఎలికతోకల జడలేసుకుని ఏ అరుగుల మొత్తల్నబడ్తే ఆ యరుగు మొత్తలకాడ తచ్చాడ్తావుండే పిల్లమందలు యిట్ట తెలవకుండానే వుండట్టుండి, రంగుకోక లెగ్గట్టి నునుపెక్కిన కట్మస్తీతో ఆ వజాన కూల్జనంలో పడి పోతా వుంటే, కూకుని పరీచ్చగా సూత్తావుండ అసువంటి సుమారయిన వూరజనానికి నరాలపొట్టుదప్పి నీలుగాత్రయ్యన్నమాట.

అయితే యీమద్దెనే కాత్తె పెద్దమడ్సయిన రత్తికి ఎలికజడబొయి బంతికి మల్లే కొప్పొచ్చి, పోయిన మార్నాల పండక్కి జేజి కొనిబెట్టిన ఎర్రకోక ఎగ్గట్టి,

తెల్లగన్నేరుపూలు కొప్పులో దోపుకుంటా, అందర్లోబడి నాట్లకి ఎల్తావుంటే సూత్తా కూకుంద నలుగుర్నానికి తను ఎట్టగుపిత్తావుందది ఎట్ట తెల్సుద్ది?

శివమ్మగారి శివయ్య, బసమ్మగారి సుబ్బయ్య రాత్తాపక్క సింసెట్టుకింద పువాకు యీనెల్టీసుకుంటా ఎల్తావుండే కూలిజనాన్ని-వూరకనే సూత్తా కూకుండారు.

'సుబ్బయ్యా?'

'ఏందిర శివయ్యా?'

'ఆ పొయ్యే మడ్సి మన రంగయ్య కూతురు రత్తెట్టా?' అన్నాడు శివయ్య మీసకట్టు తుడుసుకుంటా.

'అదే సూస్తున్నా?' అన్నాడు సుబ్బయ్య రత్తిపోకడ కనిబెడ్తా.

'ఎదిగిందే!' అన్నాడు శివయ్య.

'పొందుకుమల్లే పండింది!' అన్నాడు సుబ్బయ్య.

'తల్మొండమొయ, బల్ గురిగా వొదిలావే మాట?' అన్నాడు శివయ్య సుబ్బయ్యను ఆట్టొక సూపు జూసి.

'ఉండ విషయం అది, సెప్పొద్దూ!' అన్నాడు సుబ్బయ్య సిన్నగా నవుతా.

'సినిమాకిమల్లే వుండదే!' అన్నాడు శివయ్య.

'సినిమా ఎందిరోవ్ శివయ్య?' అడిగాడు సుబ్బయ్య.

'ఎహె మొన్నంటే మొన్నడ్దాకా ఎలికితోకకుమల్లే ఇంత జడేసుకుని తిరుగుతుండేదంటే!' అన్నాడు శివయ్య.

'ఎవరు రత్తేనా? యీ మద్దెనే పెద్దమడ్సి యిందంటలే' సెప్పాడు సుబ్బయ్య.

'యిగనేం, యిచారిస్తా వుండావన్న మాటా? మరి మనిషే కొత్తదన్నట్టు మాట్టాడ్తావేరా సుబ్బయ్యా?' అన్నాడు శివయ్య.

'ఓరి పోరా ఎంతసెడ్తా నీకుండంత రంది నాకేడుంది!' అన్నాడు సుబ్బయ్య.

'మరి జాడా తియ్యంది నీకెట్టతెల్సురా అది పెద్దమడ్సయిందనీ?' అడిగాడు శివయ్య.

'అంతేనా! మడ్సినిజాత్తే ఆ మాత్రం తెలవదేట్టా? అయినా నీకు నాకుమల్లే నలుగురు అనుకుంటావుంటే యియన్ని యినికొచ్చుకోకబోయినా తెలుస్తావుంటయ్యే?' యిడదీసినట్టు సెప్పాడు సుబ్బయ్య.

'అంతేననుకో' వొప్పుకున్నాడు శివయ్య.

'ఆళ్ళ జేజి దెలుసా?' అన్నాడు సుబ్బయ్య.

'ఎవరి జేజి?' అన్నాడు శివయ్య.

'రత్తి జేజంటే ?'

'ఎవరు రోసెమ్మేనా? అదిగేం రత్తి పక్కనే ఎల్తా.'

'పక్కనే ఎల్తుండదంటాడూ. కరుసుకుని ఎల్తుంటే ?' అన్నాడు సుబ్బయ్య.

'కాపలా ఎట్టా ?'

'మరేంది! అబ్బో యీ ముసలోళ్ళ సంగతి యింకా నీకు బాగా తెలవదు గావాల్ను - చరేలే! అసలీ రోసెమ్మ మాటకి ముంగలే రోక లెత్తుద్దంట!' అన్నాడు సుబ్బయ్య.

'ఏంటి, రత్తిమీద ఎవరన్నా కన్నేస్తారనేనా ?'

'అదే దానాట.'

'ఆఁ ముసల్ది! ఓరిపోరా యీ గూడెంజనం మనకి కొత్తంటా! అస లెందుకు పద్దినాలు నువ్వు వోపికపట్టి సూడు, యవారం ఎట్టదిరుగుద్దో స్రెక్రం దిరిగినట్టు!' అన్నాడు శివయ్య.

'ముసలాళ్ళకి కక్కుర్తి బొహు జాస్తంటలే. యింత సిన్న ఎండిబిల్ల సేతిలో బడ్తే సరి' అన్నాడు సుబ్బయ్య.

'మరిగనేం!' అన్నాడు శివయ్య.

'అన్నట్టు ఎంకట్రామయ్య నాల్దినాల్నుంచి యీ రోసెమ్మోళ్ళ గుడిసెల కాడే తిరుగుతావుండాడంట దేనికనబ్బా?' అన్నాడు సుబ్బయ్య.

'ఎవరు అంకమ్మగారి ఎంకట్రామయ్యా?'

'మరింకెవరు అడుగాకుంటె?'

'అరి - అణ్ణోపాలి నలగబొడవాల్సిందే!' అన్నాడు శివయ్య.

'పెతోడికన్నా రత్తిమీనే! అందుట్లో ఈడు జేరాడా-' అన్నాడు సుబ్బయ్య.

'నువ్వుమటుకు వూరకనే వుండేవోడివికాదే!' అన్నాడు శివయ్య.

'చా, నీతోడు! అసలు గూడెంసాయలకి ఎల్లే వారం పద్దినాలయితే! యింకా నువేమన్నా బోగట్టా జేశావేమోనని అడుగుదామనుకుంటుంటే?' అన్నాడు సుబ్బయ్య.

'ఏంది–? తల్మున్దమొయ్య నవురా మనగాడివంటే సుబ్బయ్యా! అసలం దుగ్గాడూ నీకు కళవారుమణోలాఅని పేరొచ్చిందీ! పేడతక్కడని కతో టుండదిలే; అట్టుండది నీ యవారం జూస్తే.'

'అబ్బే గూడె.కల్లేమన్నా ఎట్టుండావేమోనని అడిగాలే' అన్నాడు సుబ్బయ్య.

'ఎహె, యిదియ్యాల కోకగట్టుకు అగుపిస్తే చూడాల్సొచ్చిందిగాని యింతకిముంగల దీనిమొగం ఎవరుజూశారూ?' అన్నాడు శివయ్య.

'అన్నట్టు రోసెమ్మోళ్ళు ఎంకట్రామయ్య సేనుకే నాట్లుకపోయింది, తెల్సా?'

ఆఁ! తస్సదియ్య, ఆడ్డా వొంటిసేతిమీద యవారం నడుపుతాడూ! అప్పుడే జాడాధీశావే – నువు వూరుకుంటా!' అన్నాడు శివయ్య.

'ఆఁ, యిందాక ఎంకయ్యంటుంటే తెల్సిందిగాని లేకబోతే నా కిదేనెట్టా పనీ – యింకా నయం!' అన్నాడు సుబ్బయ్య.

'మరి నువు యింకా మొదలుపెట్టించలేదేం నాట్లూ?' అన్నాడు శివయ్య.

'యింకా నీరెక్కందే! మీకో?' అన్నాడు సుబ్బయ్య.

'మాదీ మీతోపాటే అవుతుందిలే. అన్నట్టు మంగి ఏమంటున్నదీ?' అన్నాడు శివయ్య.

'ఆదా—! అబ్బే దాని మొగంజూసే నాలుగయిదు నెల్లయితే. ఆ రోజులన్నీ పోయినయిలే శివయ్యా, యిప్పుడేందో మనదార్న మనంపోతే బాగుండు ననిపిస్తున్నది' అన్నాడు సుబ్బయ్య.

'అబ్బొవ్! యీ సుబ్బయ్య పెద్దమడిసైతుండట్టుందే! ఓరి పోరా నాకా తంట నీపార్సా? కిందట నూర్పిళ్ళప్పుడుకదంట్రా మంగిని ఆ దొంకలకాడ దారి దప్పించి మీ సాయిడిలోకి తీసికెల్లిందీ!' అన్నాడు శివయ్య.

'సరేలే! యింతే నన్నమాట నీకు తెల్సింది! దానంతట అదేగా ఎంట పడిందీ!' అన్నాడు సుబ్బయ్య.

'ఓరి పోరా నీ మాటలకేం వొచ్చిందీ! మంగి సంగతి నాకు తెలియదూ, లబోయ్ దిబాయ్మంటూ ఆదావజాన ఏడ్సిబోతే?' అన్నాడు శివయ్య.

'సీ కాడికొచ్చి ఏడ్సుకుండదేం? ఓరి పోరా నువుమటుకు దాన్ని వూరకనే పోనిచ్చావంటా?' అన్నాడు సుబ్బయ్య.

'నేనా–! తెలవక ఏదో ఒక్కపాలి బుద్ధి గెడ్డి తిన్నదనుకో. ఎట్టయితే

యేం అదేం ఆశబెట్టావో ఏమో సివరికి అది ఎటూ గాకుండా ఎల్లి, ఆ ముసలోణ్ణి పెళ్లి జేసుకుండె!' అన్నాడు శివయ్య. 'సరే, దానికి ఆ ముసలాడే దేముడికిమల్లె వుండే! పోనిద్దూ యిప్పుడెందుకొచ్చింది ఆ పాతపురానమంతా,' అన్నాడు సుబ్బయ్య

'నిజమంతే ననుకో,' అన్నాడు శివయ్య.

'రత్తి బహుగెట్టిది – అది నడకెట్ట నడుసుద్దో సూశావుగా?' అన్నాడు సుబ్బయ్య.

'సూ సేతలికే కరెంటుకొట్టినట్టు తల్దిరుగుతే?' అన్నాడు శివయ్య.

'అయినా వుత్తపిల్లముండలే' అన్నాడు సుబ్బయ్య.

'యియ్యాలేగా అది కోకగట్టిందీ?' అన్నాడు శివయ్య.

'అంతేననుకో. నీకాడ చేబోలు వుపాకుండట్టుందే–?

'కావలెట్టా?'

'కావాలా–? తేతేతే–'

* * *

తెల్లారి సింగారిచ్చుకు నాటు కెల్లిన రంగుకోకల కూల్జనం మాపిటేలకి పంటకాలవలకాడ, సెరువు సెప్టాలకాడ, వొంటి మీన ఆడీద కొట్టుకుండ బురద–కాళ్ళ కడాలూ, సేతి గాజులు సుబ్బరంగా కడుక్కుని, గీగామంటా కూలిగింజలు కొలిపిచ్చుకునేవోరూ, యింటికాడ పిల్లోళ్లేడుత్తా వుంటారని ఆటెటు లగెత్తేవోళ్ళూ, బువలోకి మిరపగాయ బొరపగాయనీ, ఎర్రగెడ్డ తెల్లగెడ్డలనీ, మరసనాటికి గొబ్బరిసవ్వరు ఎట్టననుకుంటా చీసాకాయిలకి లగెత్తేవోరూ, మొగోళ్ళకి పువాకను కుంటా, బుడ్డోడికి కాత్తేమన్నా పెట్టమంటా ఊళ్ళో ఆమూల యీమూల, కోవంటికొట్లకాడ కాళ్ళకడాల మోత బుట్టిచ్చి, సివరకి తోసేసి ట్టు ఎటుజనం అటు సల్లసల్లగా గూడెం సేరుకుండారు.

కొత్తగా కోకగట్టి జనం మద్దెకొచ్చిపడ్డ రత్తికి ఆయాల మనసంతా - బిర్జీమీన రవిలుబండి లగెత్తినట్టు కొట్టుకుంది. ఆదేందో రాత్తామీన నడుత్తున్నంత లెక్కా– పక్కపక్కా– అరుగులమీన, సెట్లకింద కూకుండ మొగజనం రెండేసి రెండేసి బారల ముల్లుకర్రలు దీసుకుని తన ఎర్రకోకమీన పొడుత్తా వుండట్టే అనిపించింది రత్తికి. యీ మడుసులు తను యిన్నాలమించీ ఎరిగిన మడుసులు కారు. యీళ్ళ కళ్లు కోటయకొండ తిరనాల్లో వెల్కట్రీ దీపాలకిమల్లే దగదగ మెరుత్తుండయి.

'నాచేస్తున్నంత లెక్కా ఆ ఎంకట్రామయ్య పొద్దు తిరుగుడు పువ్వుపు మల్లె తనెటు తిరుగుతుంటే అటు తిరుగుతానే వుండాడు. అయినా ఎర్రకోక బొహల బాగుంది. చీతాయ్, ఎంకాయ్, యారావుంలు ఎర్రకోక ఎట్టుండా వుంద దన్నారు. అందుకేగావాంలు రాత్తాపక్క జనం అట్టాజూశారు? అయినా యిదేంది పాడూ, కొత్తకోక కట్టుకుంటే పొడిసినట్టు ఆజాన సూడాలెట్టా? చీ పాడూ, చిగ్గేసుద్దీ! అదేంది మరీ ఆ ఎంకట్రామయ్య యాడో జబ్బునపడి లెగిసినోడికి మల్లే అట్ట జూత్తాడూ? నిజంగా అదేందో జబ్బే యీళ్ళకి - యామో పాడు—' అని ఎట్టెట్టనో అనుకుందది రత్తి.

అయ్య బువదిని బయట మంచాం ఏసుకుని సె చుక్కర వూదుకుంటా కూకుండాడు. జేజి అమ్మకీ, పిన్నావుంకూ, రత్తికి కంచాలు పెడ్తావుంది బువ దింటానికి.

ఆయాల్దాకా కుండలో గాబుల్లో పిన్నావుంతో బాయికాణ్ణుంచి నీలుదెచ్చి పోత్తావుండ రత్తికి తెల్లారినాట్లకు తన కొత్తకోకమీన బురదమచ్చ లుంటయ్యని పించింది.

'అమ్మోవ్, సెరువుకాడ కోక జాడిచ్చుకొత్తానే?' అమ్మ నడిగింది రత్తి.

'యీవర్దాకా ఏంజేశావే - తెల్లారి జాడిచ్చుకుందువులే' అంది అమ్మ.

'నాటు కెళ్ళేయాలకు ఎట్టారుద్దమ్మా? దొబ్బు నెల్లొత్తానమ్మా' అంది రత్తి.

'ఓ యవ్వో? కొత్తకోక గట్టిందిగాని నాటెయిదుగావాంల యీపిల్ల! ఏం అదిరిపడ్తుందదమ్మోవ్ నీ కూతురూ? యిగ సాల్లే సంబడం, పెటెలో దాసుకో పండక్కీ బొండక్కంటా కట్టుకుందువుగాని. యియ్యాల కట్టుకుందది సాల్లే - సిచ్చేపమంటి కొత్తకోకని గాత్తా బురదసీలల్లో పొల్లిచ్చుద్దంట సూడ మ్మోవ్ నీ కూతురు?' అంది జేజి.

'అం యీవిడే మాగాంగా కొనిబెట్టింది! మా అయ్యనడిగి నే నింకోటి కొనిబెట్టిచ్చుకోననుకుండావా?' అంది రత్తి.

'అయ్యో వగలూ! మీ అయ్యొకటి కొనిబెడ్తే నీ మొగుడెన్ని కొనిబడ్తాడే పిల్లా?' అంది జేజి మచ్చటగా.

'తెల్లారి లెగుత్తే యీయిడ కెప్పుడూ మొగుళ్ళే - సూడమ్మా?' అంది రత్తి.

'అమ్మ బుల్లో! యిప్పట్నుంచి ఏం ఎగిరిపడ్తుందదమ్మోవ్ నీ కూతురూ!

సూత్తుండావుగా, యిప్పుడెల్లి ఆ సెరువుకాడ కోక జాడిచ్చుద్దంట నీకూతురు!' అంది జేజి.

'అయితే నువు కూడు దినవంటే రత్తీ, మేం కూకుంటుండాం, యామో నమ్మ యీపిల్లతో సావుగుండదది,' అంది అమ్మ.

'దానికి కోకతోనే కడుపు నిండుతుండె,' అంది పిన్నాం, కంచాంకల్లి సూత్తా.

'రేపుటికి పరికిసీ కట్టుకోరాదంటే? యిప్పట్నుంచీ కోకలేందమ్మా యీ పిల్లకూ?' అంది అమ్మ.

'యిగ సాల్లే వూరుకో! యింకా పరికినా లేపిచ్చుద్దంట యీవేందో! పిన్నాం కోకేవన్నా కట్టుకుందువులే యిప్పుడేడకి బోలావు సీకట్లో,' అంది జేజి.

'ఆడ నాకుమటుకేం వుండయ్యమ్మో కోకలూ,' అంటన్నది పిన్నాం.

'వుప్పుడు నీ బంగార మేం పీక్క దిన్లేదులే నువు వూరుకోమ్మా. గాబు కాడ దొఖ్ఖున జాడిచ్చుకురారాదంటే యాడికో వుప్పుడు పడిపోకపోతే?' అంది అమ్మ.

'సచ్చేట్టు దెచ్చిన నీలన్నీ వుప్పుడీమె కోకలు జాడిత్తా కూకుంటది గావాలు?' అంటున్నది పిన్నాం.

'నువ్వేమ్మా తెచ్చిందీ? సూడమ్మా-?' అంటన్నది రత్తి.

'యిగ యియ్యాల యీళ్ళతో కూడుదిన్నట్టే! గబగబ బాయికాడ కెల్లి రెండుబుంగలు నీలు దెచ్చుకుని యీడే గుంజుకోరాదంటే కోకా - ఎల్లవేందే రత్తాం?' అంది అమ్మ, పేసీ లెందుకంటా.

'అవ్!' అంది రత్తి బుంగ సేతబట్టా.

'పిల్లముండను ఒక్కత్తెనే సీకట్లోపంపుద్ది?' అంది జేజి.

'వుఁ నంగనాసి - నే లెగవనమ్మా వుప్పుడు - అసలే వొల్లంతా యిర గ్గొట్టేట్టుంది,' అంది పిన్నాం.

'నిన్నెవురేం రామన్లా పాపం —' అంటన్నది రత్తి.

'యిదిగో రత్తాం' అంటా యిసుగుతో అమ్మ లెగవక తలికే బయట సెంచుకర్ర మైకంలోపడ్డ అయ్యని దాటి రాత్తా మీనకొచ్చి వాలింది రత్తి బుంగా, సేదతో.

పెయ్యదూడను పాల కొదిల్నట్టు - మద్దె మద్దె అరీరు సూడకుండా - ఎగిరెగుర్తా గబగబ బాయిదెగ్గిరకి సేర్తావుండ రత్తికి, ఎంకటామయ్య గొడ్డ

సావిడికాడి కొత్వేలలో తత్తర బుట్టింది.

'ఎవరా ఎల్లేది ?' అన్నదా యిగ్రహం దారిమయాని కొచ్చి నిలబడ్తా. అది ఎంకట్రామయ్య కంటం. మట్టిబుంగ తాప్పున బూమ్మీనపడి ఎయ్యిసెక్కలుగా పగలాల్చింసిగాని - తెప్పకొయ్యని కరుసుకుండట్టు కర్సుకుంది బుంగకు రత్తి.

'ర–ర–ర–ర–త్తిని–' మాట కొట్టుకుంది రత్తికి.

ఎంకట్రామయ్య ఎందుకో సప్పరిత్తుండా డనుకుంది రత్తి.

'యాడికో ఎగురుకుంటా పోతావుండావే – ఎనక మీ జేజి లేదెట్టా ?' అన్నాడు ఎంకట్రామయ్య సేతులు పిసుక్కుంటా.

'కోక జాడిచ్చుకోను– దొబ్బున– ఎల్లమంటేనీ–' రత్తి నాలిక మడ్తబడింది.

'యిగనేం– యిదిగో–' సీకట్లో అటిటు సూశాడు ఎంకట్రామయ్య.

'ఆఁ–?' అంది రత్తి.

'కాత్త నీతో పనుండదే–'

'ఓమ్మో–!'

'ఏహె ఊరకనేలే అరవమాకా– యిప్పుడే ఎల్దువుగాని, సొయిట్లోకి వొత్తావెట్టా–?' ఎచ్చగా ఎంకట్రామయ్య సావిడి గోడసాటుకు లాగాడు రత్తిని ఏంటెదంటా.

'ఏందీ– యాడికో అట్ట గుంజుతాడేం– యిదేందమ్మా– వామ్మో–' ఎంకట్రామయ్య కళ్లు వెలట్టీదీపాలకిమల్లే అట్టెలిగినయ్యో లేదో, యిదిలించి దూసుకుంద దూసుకోటం– ఎల్లి బాయికాడ ఆవురావురుమంటా పద్దోసెళ్ళు నీలు తాగిన రత్తికి వొల్లంతా సెవటలుబట్టి గుడ్డల్లదిసినై.

'ఎవురు–ఏంది రత్తోవ్ ఆదేమొయిన నీలు దాగుతుండావ్ ?' అన్నది నీల కొచ్చి నిలబడ్డ చీతాం.

'ఎవురు–చీతాం–యదవ–సెడ్డదప్పికయిందే చీతాం–చీతాం–?' అంది రత్తి దడదడమంటా.

'ఏందే రత్తి ?' అంది చీతాం.

'నువేనా, యింకా ఎవురో అనుకుండాలే– దొబ్బున నీలు లాగమ్మ యిద్దరం కాత్తలెక్క కల్చేద్దాం–'

చీతాన్ని సాటుజేసుకుని ఎంకట్రామయ్య సావిడిదాట్న రత్తి యింకాత్తె

లెక్క- బోయినాక యిగ పరవాలేదనుకుంటా చీతాంతో సీలి గబగబ యింటికి మల్లింది ఆడీడ ఎల్దురు సూసుకుంటా.

గబగబ యీది మలుపుకుండా వొచ్చి-పొలంగు దిగేసినట్టు అటనే నిలబడి పోయి- అట్ట మొగంమీనకి తొంగిసూసిందా యిగ్రహం.

'ఎవురూ-?' అంది రత్తి, చినిమా జూసినట్టయి.

'నే సుబ్బయ్యన్లే- మా శివయ్యేమో ననుకుండాలే- నువు రత్తివెట్టా?' అన్నాడు సుబ్బయ్య జరుగుతా.

'వుండు ఎల్దాల-'

'ఎల్దువులే-'

'యిగ సాల్లే లెగు-'

'ఎవురూ లేర్లే'- అంటన్న సుబ్బయ్యకు పటపటపట నరాలు తెగినట్టయి సేతులు లెగత్తుండయ్యో లేదో-

'టాప్' మని యీపుమీన పెట్లదిమ్మ మోగేతలికి- బత్తా ఎత్తేసినట్టు- బూమ్మీనకి పల్టీకొట్టి పొండుకుండాడు సుబ్బయ్య.

'యేదవా!' అన్న దాయిగ్రహం సుబ్బయ్యను వొంగిసూత్తా.

'ఓరి శివయ్యోవ్-సత్తిన్రా-' అని మూలిగాడు సుబ్బయ్య యీపుమీన సేతుల్తో అటనే లెగిసి కూకుంటా.

'ఏవురు సుబ్బయ్యా-సచ్చాన్రా నాయినా-' గబగబ సుబ్బయ్యను వాటేసుకుని లెగవదీశాడు శివయ్య.

'యిదేందిర శివయ్యోవ్-'

'అరెరెరె - ఎంకట్రామయ్య ఏటుకు సచ్చాడనుకుంటిని గదంట్రా సుబ్బయ్యా-'

'పొల్లాడ్దన్నంట్రా- కాత్తె వాటేసుకోరా నాయనా-'

* * *

ఆ రేత్తిరి ఎర్రకోక సుట్టూతా వెల్క్రటీ దీపాలు గిర్‌గిరా తిరుగుతూ టాప్‌టాప్‌మంటా పగుల్తుండట్టు కలగంటన్న రత్తి సుట్టూ సల్లగా లెగిసిన జేజి యింత వుప్పుగల్లు దిగదుడ్సి బారేసింది.